సాక్షి తిరుపతి

ఆదివారం। 14। జనవరి। 2024

I



పేదల పెన్నిధి సీఎం జగన్

అనేక సంక్షేమ పథకాలు అందించి పేదల పక్షపాతిగా సీఎం వైఎస్.జగన్ కీర్తిగడిం చారని ఎమ్మెల్యే కిలివేటి తెలిపారు. - IIలో



చుక్కలతోటలో చక్కగున్నావే

సంక్రాంతి సంబరాల్లో భాగంగా తుమ్మలగుంటలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. - IIలో



సంక్రాంతి నృత్యాలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో భరతనాట్య పోటీలు నిర్వహించారు. - IIలో

న్యూస్‌రీల్

ప్రతి ఇంటా 'భోగి'భాగ్యాలు నిండాలి

తిరుపతి రూరల్/తిరుమల: భోగ భాగ్యాలనిచ్చే భోగి, సరదానిచ్చే సంక్రాంతి, కమ్మని కనుమ కొత్త ఏడాదిలో మన జీవితాల్లో సరికొత్త వెలుగులను నింపాలని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కే.నారాయణస్వామి, ఆర్కే.రోజా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎం.గురుమూర్తి, టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, అధికారులు ఆకాంక్షించారు. ఈ మేరకు జిల్లా ప్రజానీకానికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇంటి ముంగిట కళకళలాడే రంగవల్లులు, అందులో గొబ్బిళ్లు, బసవన్నల ఆటపాటలు, ఘుమఘుమలాడే పిండి వంటలు, హరిదాసు కీర్తనలు, కొత్త బియ్యపు పొంగళ్లతో అందరి మది ఆనందంతో పరవళ్లు తొక్కాలని ఆకాంక్షించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 56,588 మంది స్వామివారిని దర్శించుకోగా, 16,754 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకలు హుండీలో రూ.3.26 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తిరుపతి శిల్పారామం వద్ద భోగిమంట





హరిదాసులు...సంబరాల లోగిళ్లు!



ముగ్గుల సింగారం...ఇల్లంతా బంగారం!

● ఊరికి పండుగొచ్చింది

తిరుపతి జిల్లా వ్యాప్తంగా పండగ సందడి నెలకొంది. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని పల్లె, పట్నం తేడాలేకుండా పండగ వాతావరణం ఉట్టిపడుతోంది. రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, కొత్త అల్లుళ్లు, కొంటె మరదళ్ల చిలిపిచేష్టలు, గాలిపటాల కేరింతలు, ఘుమఘుమలాడే పిండివంటలతో పల్లె వాతావరణం శోభాయమానంగా మారింది. – సాక్షి, తిరుపతి



తిరుపతి రాజ్ భవన్ వద్ద సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న మహిళలు

సంక్రాంతి రద్దీ



తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో సంక్రాంతి రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు జనం బారులు తీరుతున్నారు. రద్దీకి తగ్గట్టుగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసింది. బస్టాండ్‌లో 67 ప్లాట్‌ఫారాలకు సంబంధించి ఏడుగురు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి తోపులాటలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే పది ప్లాట్‌ఫారాలకు ఒక ఆర్టీసీ ఉద్యోగిని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. సంక్రాంతి రద్దీ నేపథ్యంలో మొత్తం 454 అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. అలాగే ఎలాంటి అదనపు చార్జీలు పెంచకుండా సాధారణ చార్జీలతోనే సర్వీసులు తిప్పుతుండడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

శ్రీసిటీని సందర్శించిన అడిషనల్ డీజీపీ



అడిషల్ డీజీపీ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్ శనివారం శ్రీసిటీని సందర్శించారు. ఆయనకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం శ్రీసిటీ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలు, స్థానికంగా భద్రతా వ్యవస్థ వివరాలను ఆయనకు వివరించారు. శ్రీసిటీ పరిసరాలను ఆయన పరిశీలించడంతో పాటు క్రియా విశ్వవిద్యాలయం, రాక్‌వర్త్, ఎవర్టన్, హంటర్ డగ్లస్ పరిశ్రమలను సందర్శించారు. డీజీపీ వెంట ఆయన సతీమణి, ప్రముఖ ఆర్కిటెక్ ఇంటీరియర్ డిజైనర్ ప్రియంకాసింగ్ ఉన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ గత ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన ఎంఎస్సీ జాగ్రఫీ మూడవ సెమిస్టర్, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ నాల్గొవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లా నాయక్ తెలిపారు. ఫలితాలను విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గజ గజా!

- భారీగా చెరుకు పంట ధ్వంసం
- రెండుగా విడిపోయిన ఏనుగుల గుంపు
- భీమవరం అడవుల వైపు ఓ గుంపు
- కానుగల వంకలో మరో గుంపు
- ఆందోళనలో అన్నదాతలు



ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన చెరుకు తోట

భాకరాపేట : గజరాజులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పంట పొలాలను ధ్వంసం చేస్తూ రైతన్నకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. గ్రామాల వైపు దూసుకొస్తూ స్థానికులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి మందనుంచి విడిపోయిన ఒక గుంపు మండలంలోని ఎగవూరు పంచాయతీ, బొగ్గలవారిపల్లె, గొల్లపల్లె, ఎస్టీ కాలనీ సరిహద్దు పొలాలపై పడి ధ్వంసం చేసింది. చెరుకు, కొబ్బరి, మామిడి తోటలను సర్వనాశనం చేసింది. అర్ధరాత్రి వేళ ఎగవూరు పంచాయతీ మాజీ సర్పంచ్ దేవప్రసాద్ అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే భాకరాపేట అటవీ అధికారులు సిబ్బందితో వచ్చి టపాకాయలు కాల్చి పంట పొలాల్లో ఉన్న ఏనుగుల గుంపును భీమవరం అడవుల్లోకి మళ్లించారు. మరో గుంపు తిప్పిరెడ్డిగారిపల్లె, జంగావాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని వారుదోనిగుండు ప్రాంతంలో మామిడి తోపుల గుండా కానుగలవంక వైపు వెళ్లింది. విడిపోయిన ఏనుగుల గుంపు ఒక్కటయ్యేవరకు అవి ఎటువైపు నుంచి వచ్చి దాడిచేస్తోయో తెలియదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానుగలవంక ప్రాంతంలో ఒక గుంపు, భీమవరం అడవుల్లో మరో గుంపు ఉన్నాయని తెలిపారు. ఎగవూరు, దిగవూరు, నెల్లుట్లవారిపల్లె, తిప్పిరెడ్డిగారిపల్లె, జంగావాండ్లపల్లె పంచాయతీల్లో అటవీ సరిహద్దు వ్యవసాయ పొలాల్లో ఉన్న రైతులు గజగజా వణికిపోతున్నారు. పశువులు, మేకలు, గొర్రెలు అటవీ ప్రాంతంలోకి మేతకు తీసుకెళ్లడానికి కూడా భయపడిపోతున్నారు.

దారి మళ్లిద్దాం

అటవీ అధికారుల చొరవతో ఏనుగుల గుంపును దారిమళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి తెలిపారు. శనివారం అటవీ సరిహద్దు గ్రామాల పంచాయతీ సర్పంచులతో ఆయన సమావేశమయ్యారు. రెండుగా విడిపోయిన ఏనుగుల గుంపును ఒక్కటిచేసేలా చర్యలు చేపడుతామన్నారు. సమావేశంలో సర్పంచులు కుమారి, శంకర్‌రెడ్డి, శశిప్రియ, మాధవి, సింహాల విమల, మాజీ సర్పంచ్ దేవప్రసాద్, ఎంపీటీసీ అమరావతి పాల్గొన్నారు.

సంక్రాంతి నృత్యాలు

తిరుచానూరు(చంద్రగిరి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్య నృత్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. తిరుపతి నటరాజ నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో కళాకారులు చక్కటి అభినయంతో అలరించారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

16న కైలాసగిరి ప్రదక్షిణ

శ్రీకాళహస్తి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈనెల 16న శివపార్వతులు కైలాసగిరి ప్రదక్షిణ చేయనున్నారు. సాధారణంగా శ్రీకాళహస్తిలో ప్రతిఏటా రెండు సార్లు స్వామి, అమ్మవార్ల గిరిప్రదక్షిణ ఉంటుంది. మొదటిది కనుమ పండుగ రోజున కైలాసగిరుల్లో ఉండే దేవతలను మహాశివరాత్రి ఉత్సవాల్లో జరిగే తమ కల్యాణానికి రావాలని ఆహ్వానిస్తారు. అనంతరం మరోసారి గిరిప్రదక్షిణగా వెళ్లి దేవతలకు వీడ్కోలు పలుకుతారు. ప్రతి ఏటా ఈ గిరిప్రదక్షిణ ఎంతో వేడుకగా జరుగుతుంది. ఈ మేరకు మంగళవారం ఉదయం 7.30 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయం నుంచి గిరిప్రదక్షిణకు బయలుదేరనున్నట్టు ఆలయాధికారులు తెలిపారు.

పార్టీలు చూడం..అర్హతే ప్రామాణికం!

గూడూరురూరల్: 'పార్టీలు చూడం.. కులాలు చూడం..'అంటూ సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకిచ్చిన మాటను నిఖార్సుగా నిలబెట్టుకుంటున్నారు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. అర్హతే ప్రమాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ మన్ననలు అందుకుంటున్నారు. ఈ క్రమంలోనే గూడూరు పట్టణంలోని ఎగువ వీరారెడ్డిపల్లికి చెందిన గాయం వెంకటరమణయ్య టీడీపీలో రెండు పర్యాయాలు కౌన్సిలర్‌గా పనిచేశారు. అటు తర్వాత ఆయన పట్టణ టీడీపీ ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. ఆయన ఓఏపీకి అర్హత ఉండడంతో స్థానిక వలంటీర్ పీ.సురేష్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. దీంతో అతనికి నూతన పింఛన్ మంజూరు కావడంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంజూరు పత్రం ఇవ్వడంతో పాటుగా పింఛన్ రూ.3 వేలు సచివాలయ కన్వీనర్ సుప్రియ చేతులమీదుగా అందించారు.



టీడీపీ నాయకునికి పింఛన్ అందిస్తున్న సచివాలయ కన్వీనర్

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య



జనార్దన్ (ఫైల్)

దొరవారిసత్రం: భార్యపై గొడవ పడి భర్త బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘనట శనివారం ఆనేపూడి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. ఆనేపూడి గ్రామానికి చెందిన జనార్దన్(36) బెల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య కుటుంబ సమస్యల విషయమై వాదోపవాదాలు జరిగాయి. క్షణికావేశానికి లోనైన జనార్దన్ సమీపంలో ఉన్న బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు వెళ్లి జనార్దన్‌ను కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. స్థానిక ఎస్‌ఐ తిరుమలరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అర్ధరాత్రి అక్రమ మట్టి తవ్వకాలు

- అడ్డుకున్న దళితులపై దౌర్జన్యం
- న్యాయం చేయాలంటూ ఆర్డీఓ నిశాంత్‌రెడ్డికి ఫిర్యాదు



ఆర్డీఓ నిశాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మొరవపల్లి దళితులు

చంద్రగిరి: రాత్రికి రాత్రి జేసీబీలు, టిప్పర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తూ అడ్డొచ్చిన దళితులపై అగ్రకులాలకు చెందిన వారు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారంటూ మొరవపల్లి దళితులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గ్రామస్తులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ నిశాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దళితులు మాట్లాడుతూ.. మొరవపల్లి దళిత వాడకు చెందిన చెంగ్రాయులుతో పాటు ఇతర దళితులకు అసైన్డ్ భూములు ఉన్నాయన్నారు. అయితే అగ్రవర్ణాలకు చెందిన చంద్రబాబునాయుడు, పాలడుగు అమర్‌నాథ్ నాయుడు, శేఖర్ నాయుడు, సుబ్రమణ్యంనాయుడు, బొబ్బా దూర్వాశులనాయుడు శుక్రవారం రాత్రి పాలేటికోన చెరువు కట్ట, బండిబాటలో భారీ యంత్రాలతో 15 మీటర్లకు పైగా తవ్వి టిప్పర్ల సాయంతో మట్టిని తరలించారని తెలిపారు. పాలేటి కోన చెరువు గట్టు కింద భారీ గుంతలు ఏర్పడడంతో బండిబాట కూడా కనుమరుగైందని, తమ పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని వాపోయారు. దళితుల భూములకు దారి లేకపోవడంతో అగ్రకులాల వారిని ప్రశ్నించడంతో తమపై దౌర్జన్యం చేసి, చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడినట్లు ఆర్డీఓకు మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన ఆయన తక్షణమే విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శిరీషను ఆదేశించారు.

చుక్కల తోటలో.. చక్కగున్నావే!

- తుమ్మలగుంటలో రంగవల్లుల సందడి
- ముగ్గుల పోటీలకు విశేష స్పందన
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన చెవిరెడ్డి లక్ష్మి



తుమ్మలగుంటలో ముగ్గుల పోటీల సందర్భంగా అందమైన రంగవల్లులు

తిరుపతి రూరల్: అరచేతి వేళ్లను కుంచెలుగా.. ఆకాశంలోని చుక్కలను అవనిపై చేర్చినట్లు అందమైన రంగవల్లులతో అతివలు సందడి చేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంటలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. చంద్రగిరి, తిరుపతి రూరల్, రామచంద్రాపురం, పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలతో పాటు, తిరుపతి నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. 329 మంది మహిళలు తమ రంగవల్లులతో ప్రతిభను చాటారు. మహిళలు వేసిన ముగ్గులు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబం చేస్తున్న కృషిని ప్రతిఒక్కరూ అభినందించారు. న్యాయ నిర్ణేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ ముగ్గులను ఎంపిక చేశారు. విజేతలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లందుల సుబ్బరామిరెడ్డి, ఎంపీటీసీ బుజ్జెమ్మ, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సీఎం జగన్



చిల్లకూరులో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎన్ డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి



వాటర్ ప్లాంట్ నుంచి ఉచితంగా తాగునీరు అందిస్తున్న నేతలు

పెళ్లకూరు: పేదల పెన్నిధి అయిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రభావతమ్మ దంపతులు చిల్లకూరులో చింతంరెడ్డి గంగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులకు నేరుగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు.

అందరికి ఉచితంగా తాగునీరు

చింతంరెడ్డి గంగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిల్లకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్ ద్వారా అందరికీ ఉచితంగా తాగునీరు అందజేస్తామని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. చిల్లకూరు, జీలపాటూరు, దొడ్లవారిమిట్ట, వడ్డిపాళెం, పెళ్లకూరు తదితర పరిసర ప్రాంతాల ప్రజలకు 24 గంటలపాటు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కరణం రఘునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మధుసూదన్‌నాయుడు, మాతయ్య, వినోద్‌రెడ్డి, రమణారెడ్డి, మోహన్, కృష్ణయ్య, చెంగయ్య, సతీష్‌రెడ్డి, మునిరాజ, చంద్రయ్యనాయుడు పాల్గొన్నారు.

సంస్కృతిని ఆవిష్కరింపజేసిన కవి సమ్మేళనం



ద్రవిడ వర్సిటీ వీసీ మధుజ్యోతిని సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: సామాజిక విలువలు, పతనమైపోతున్న సంస్కృతి, తెలుగు భాషా వైభవం వంటి అంశాలతో సంక్రాంతి కవి సమ్మేళనం కవితలతో గుబాళించింది. తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం యూత్‌హాస్టల్లో సంక్రాంతి కవితలతో కవి సమ్మేళనం నిర్వహించారు. ద్రవిడ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కొలుకలూరి మధుజ్యోతి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కవి తన అనుభూతులను, సామాజిక అనుభవాలను కవిత్వంగా మలచడం ఒక ప్రసవ వేదన వంటిదని, తెలిపారు. జిల్లాలో అన్ని సాహిత్య సంస్థలను ఏకతాటిపైకి తెచ్చి తిరుపతి జిల్లా రచయితల సంఘంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పలువురు కవులు తమదైన శైలిలో మారుతున్న సాంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక విలువలను కవితల్లో సాక్షాత్కరించారు. రచయితల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, డాక్టర్ కలువగుంట రామమూర్తి కవిత్వాన్ని విశ్లేషించారు.రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధరప్రసాద్, కోశాధికారి ఏనుగు అంకమ నాయుడు, సాహితీ వేత్తలు డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, ఆర్‌సీకే.రాజు, కలువు పేరూరు బాలసుబ్రమణ్యం, నెమిలేటి కిట్టన్న, దూబగుంట రామకృష్ణ, ఆకుల మల్లేశ్వరరావు, పొక్కళ్ల సుభద్ర, బసవరాజు ధర్మరాజు, చెన్నకేశవులు నాయుడు, యువశ్రీ మురళి, పలువు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.